క్లుప్తంగా

న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థలో లా విద్యార్థులకు మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. క్రిమినల్, సివిల్ ప్రొసీజర్ కోడ్, భారతీయ శిక్షాస్మృతిలోని పలు కీలక అంశాలు, నిబంధనలను తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయసేవలను వివరించారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

కడియం: మండలంలోని మాధవరాయుడు పాలెం గ్రామంలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, సాంద్ర సింధు వేదం ప్రచారం నిర్వహించినట్లు త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు తెలిపారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరాలను తెలుసుకోవడం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మాల స్థాపన జరుగుతుందని, ఇదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమన్నారు.

వైద్యశిబిరం

ప్రకాశం నగర్: ఉయ్యూరి ప్రేమా జోసెఫ్ జ్ఞాపకార్థం మంగళవారం స్థానిక 14వ డివిజన్ ఆంధ్రనగర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పాశర్ల సూర్యలక్ష్మి, డాక్టర్ తాడిబోయిన నరేంద్ర కుమార్, డాక్టర్ వీవీ సత్యకుమార్, డాక్టర్ శైలజ.. పేదలకు వైద్య సేవలదించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ఉయ్యూరి ప్రేమా సతీష్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మంది వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో డేవిడ్ నవీన్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెంకే సురేష్, మాజీ కార్పొరేటర్ ఈతకోట బాపన సుధారాణి పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: కొవ్వూరు - చాగల్లు రైల్వేస్టేషన్ల మధ్య హైటెన్షన్ విద్యుత్ వైరు తెగి పడడంతో మంగళవారం రాజమహేంద్రవరం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. సింహాద్రి, కోరమండల్, జన్మభూమి, బోకారో, రత్నాచల్, కోణార్క్, హటియా -బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రాకపోకలకు అంతరాయం కలిగింది.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ



పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో చైత్రవర్షిణి

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో చైత్రవర్షిణి మంగళవారం మండలంలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల పరిస్థితి, నీటివసతి, ఫర్నీచర్, లైటింగ్ ఇతర సదుపాయాలపై ఆరాతీశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, వీఆర్‌వోలు ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..

రాజమహేంద్రవరం సిటీ: ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధుల్లో చేరిన పృథ్వీతేజ్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ టీవీఎస్ఎన్‌మూర్తి విశాఖపట్నంలో సీతమ్మధార సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం కలిశారు. బాధ్యతలు స్వీకరించిన పృథ్వీతేజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

టీటీ క్రీడాకారిణి చార్వి ఫల్గున్‌కు సత్కారం



చార్విని సత్కరిస్తున్న అకాడమీ సభ్యులు

ప్రకాశం నగర్: గౌతమి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారిణి చార్వి ఫల్గున్ జపాన్‌లో జరిగే టేబుల్ టెన్నిస్ కోచింగ్ క్యాంపు ఎంపికైన సందర్భంగా ఆమెకు మంగళవారం అకాడమీలో అభినందన సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాది భేరూలాల్‌జైన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చార్వి కోచింగ్‌లో మంచి మెలకువలు నేర్చుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అకాడమీ జేవీవీ అప్పారెడ్డి మాట్లాడుతూ చార్వి ఈ ఘనత సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కోచ్ వీటీవీ సుబ్బారావు, పి.వేణుగోపాలరావు, పీవీ సత్యనారాయణ, చార్వి తల్లిదండ్రులు రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ ఫల్గున్ పాల్గొన్నారు.

ఈ రంగు.. వట్టి హంగు

- మామిడి పండ్ల పక్వానికి రసాయనాల వినియోగం
- కొన్నిచోట్ల జోరుగా విక్రయాలు

అల్మాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పండ్లలో రారాజు మామిడి. సంపన్నులైనా, సామాన్యులైనా మామిడి రుచి ఆస్వాదించాల్సిందే. ఇలా అందరికీ పసందైన మామిడి వేసవి కాలం ప్రారంభం కావడంతో మార్కెట్‌లోకి వస్తోంది. అయితే పలుచోట్ల పండ్లను పరిశీలిస్తే పైన పటారం, లోన లొటారం అన్న చందంగా ఉన్నాయి. గాలికి రాలిన కాయలను వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైట్‌ను ఉపయోగించి మాగించి తెస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ కాల్షియం కార్బైన్ వినియోగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012లోనే నిషేధించింది. ఆరోగ్యకర పద్ధతుల్లో సహజత్వానికి దగ్గరగా మాగించాలని సూచించింది.

పండ్లు మాగే విధానం

సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథిలిన్‌తో మాగుతాయి. ఇథిలిన్ పండు పక్వానికి వచ్చినప్పుడు దాని నిర్మాణం, రంగు, రుచి వంటి మార్పులకు ఉపయోగపడుతుంది.

ప్రత్యామ్నాయ రసాయనాలు

తప్పని పరిస్థితిల్లో కాయలను మాగబెట్టేందుకు వినియోగదారులకు హాని కలిగించని ఇథలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే వినియోగించాలి. దీనిని 24 గంటల పాటు తగిలేటట్టుగా ఉంచితే ఐదు రోజుల్లో సహజత్వానికి దగ్గరగా, ఎలాంటి హాని లేకుండా మాగుతాయి. ఎత్రిల్, ఇథేపాన్ లిక్విడ్ ద్వారా కూడా మాగించవచ్చు. మామిడిని కోత అనంతరం 10 లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిల్ కలిపి, అందులో ముంచి ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా మాగుతాయి. వరిగడ్డి కింద మామిడిని మాగించడం మరింత సురక్షితం. ఇంటిలో కాయలు మాగబెట్టాలనుకుంటే కొన్ని మాగని కాయలను, మరికొన్ని మాగిన పండ్లను గాలిచొరబడని డబ్బాల్లో ఉంచాలి. పక్వానికి వచ్చిన కాయలను ఒక రూములో వరగడ్డి లేదా బోదగడ్డిలో ఉంచితే సహజ సిద్ధంగా మాగుతాయి.



అమ్మకానికి సిద్ధం చేసిన మామిడి పండ్లు

తేడాలివే..

సహజంగా మాగిన పండురంగు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన వాటిలో పండ్లు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటాయి. పైకి మాగినట్లుగా కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటాయి.

- సహజంగా మాగిన పండు నుంచి వచ్చే కమ్మని వాసన మనం దూరంగా ఉండగానే తెలుస్తుంది. కృత్రిమంగా మాగిన పండును ముక్కుకు దగ్గరగా ఉంచినప్పుడు మాత్రమే వాసన వస్తుంది.
- సహజంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడుతుంది. దీంతో తియ్యగా, రుచిగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడక తక్కువ తీపిదనం, రుచి లేకుండా ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సీజన్ రాకముందే కృత్రిమంగా మాగబెట్టి, రంగు వచ్చేటట్లు చేసిన పండ్లు కొనరాదు. రంగుచూసి మోసపోరాదు. ఇలాంటి పండు ఆరోగ్యానికి మంచిది కాదు. పండ్లు పరిపక్వత చెంది సహజంగా మాగిన పండ్లు తీసుకోవాలి. ఇవి ఆరోగ్యదాయకం. పండ్లను ముందుగా ఉప్పు కలిపిన నీటిలో 15 నుంచి 20 నిమిషాలు ఉంచాలి. తిరిగి వాటిని మంచినీటిలో కడగాలి. తర్వాత తడి లేకుండా తుడిచి తినాలి. సాధ్యమైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడం మంచిది.

నర్సరీలో విత్తనాల చోరీకి యత్నం!

- యజమాని అడ్డుకోవడంతో ఇద్దరు యువకుల పరారీ
- మోటారు సైకిల్ స్వాధీనం
- పోలీసులను ఆశ్రయించిన నర్సరీ రైతు

కడియం: మురమండ సమీపంలోని ఒక నర్సరీలో మిర్చిమేరీ గోల్డ్ రకం విత్తనాలను చోరీ చేసేందుకు ఇద్దరు యువకులు చేసిన ప్రయత్నం.. నర్సరీ రైతు అప్రమత్తమై వారిమీద తిరగబడడంతో విఫలమైంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మురమండ సమీపంలోని నర్సరీలో ఉన్న మిర్చిమేరీగోల్డ్ రకం మొక్కలకు ఉన్న విత్తనాలు గతంలో ఒకసారి మాయమయ్యాయి. దీంతో నర్సరీ రైతు రాత్రిపూట అక్కడ కాపలాగా పడుకుంటున్నారు. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి, బండిని నర్సరీ బయట నిలిపి లోపలికి రావడాన్ని నర్సరీ యజమాని గుర్తించాడు. దీంతో అప్రమత్తమై, వారిద్దరూ లోపలికి వచ్చి విత్తనాలు కోసుకునే ప్రయత్నంలో ఉండగా కేకలు వేస్తూ వారిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఆ యువకులు ఈ క్రమంలో అతడిని విడిపించుకుని మోటారు సైకిల్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. సదరు రైతు ఆ మోటారు సైకిల్‌ను నర్సరీ అసోసియేషన్ ద్వారా కడియం పోలీసులకు అప్పగించారు. దీనిపై వారు దర్యాప్తు ప్రారంభించారు. కాగా సదరు మోటారు సైకిల్ ఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్‌పై ఉన్నట్లు గుర్తించారు. భీమవరంలోని ఒక షోరూమ్ నుంచి ఆ బండిని కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. చోరీకి ప్రయత్నించిన ఇద్దరూ వ్యక్తులను విత్తనాలు అమ్ముతామంటూ తరచూ నర్సరీల వెంట తిరిగే ర్యాలి ప్రాంతానికి చెందిన వారిగా భావిస్తున్నారు. అయితే సదరు బండి వారిదేనా, లేకపోతే అది కూడా చోరీ చేసి తీసుకువచ్చిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమకు దొరికిన ఆధారాలను అనుసరించి పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మిర్చిమేరీగోల్డ్ రకం మొక్కలకు ఏర్పడిన డిమాండ్ నేపథ్యంలో చిన్నసైజు మొక్క రూ.150 పైగా పలుకుతోంది. కడియం ప్రాంతంలోని నర్సరీల్లో అతి తక్కువగా మాత్రమే ఈ రకం మొక్కలు ఉత్పత్తి అవుతున్నాయి. దీంతో వీటిని కూడా దొంగతనం చేసేందుకు కొందరు వ్యక్తులు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రకం మొక్కలు సాగుచేసే రైతులు రాత్రిపూట తమ నర్సరీల్లో స్వయంగా కాపలా ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో కూడా కడియపులంక పంచాయతీ పరిధిలో సుమారు రెండున్నర లక్షల రూపాయల విలువైన ఈ రకం మొక్కలను పీకిమరీ పట్టుకుపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

కౌన్సెలింగ్‌తో సమస్యలకు పరిష్కారం

ప్రకాశం నగర్: కౌన్సెలింగ్‌తో సమస్యలను పరిష్కరించవచ్చని కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు అన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం-2007, సంక్షేమ కార్యక్రమాలపై కొవ్వూరు, రాజమహేంద్రవరం డివిజనల్ స్థాయిలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు మాట్లాడుతూ సమన్వయశాఖల అధికారులతో కలిసి చట్టపరంగా వృద్ధులకు ఉన్న హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘాలతో కలిసి పనిచేస్తూ, సమాజంలో వృద్ధులు గౌరవప్రదంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించేందుకు అనువైన వాతావరణం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ 14567 పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ సనత్ కుమారి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు



చందన నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజీవ్ నగర్ వాసులు

ధవళేశ్వరం: గ్రామ పరిధిలోని రాజీవ్ నగర్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యను సత్వరం పరిష్కరిస్తానని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మంగళవారం ధవళేశ్వరం గ్రామ సచివాలయం-5 పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ వాసులు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయనను కలిసి విద్యుత్ సమస్యను వివరించారు. ఐదు రోజులుగా విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామన్నారు. చందన నాగేశ్వర్ వెంటనే విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి తక్షణమే రాజీవ్ నగర్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సచివాలయ కన్వీనర్లు గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కంబాలచెరువు: యువకుడు కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీహెచ్.సత్యనారాయణ (27) సీతంపేట రామాలయం సెంటర్ సమీపంలో తన అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. చిన్నప్పుడే అతడి తల్లిదండ్రులు చనిపోయారు. డిగ్రీ వరకు చదువుకున్న సత్యనారాయణ తనకు ఎవరూ లేరని మానసికంగా కుంగిపోతుండేవాడు. ఈక్రమంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొదుపు పథకం ప్రారంభం

ప్రకాశం నగర్: ఆడపిల్లల ఆర్థిక ప్రయోజనం కోసం తపాలాశాఖ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ) పథకాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభించినట్లు తపాలాశాఖ పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలు ఈ పథకానికి అర్హులని, రెండేళ్లు అందుబాటులో ఉండే ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూరుశాతం హామీల అమలు ఘనత మాదే



ఫరిజల్లిపేటలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఫరిజల్లిపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసి చూపిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ఫరిజల్లిపేటలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా ఆ గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ఆయా కుటుంబాలను ఆప్యాయంగా పలకరించారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో కేవలం రూ.47 లక్షలతో అభివృద్ధి జరిగితే, తమ ప్రభుత్వంలో గత నాలుగేళ్లలో రూ.4.13 కోట్ల మేరకు అభివృద్ధి జరిగిందని వివరించారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరలోనే ఇంటి స్థలాలను అందజేస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై కొందరు మహిళలు అడగడంతో ఈ జాప్యానికి గల కారణాలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్ ఉండమట్ల సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ ఉండమట్ల రాజబాబు పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

రాష్ట్రంలో వ్యవసాయం మరింత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఫరిజల్లిపేటకు చెందిన వైఎస్సార్ సీహెచ్‌సీ గ్రూప్ సభ్యులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో మంజూరైన రూ. 6.74 లక్షల ట్రాక్టర్‌ను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆ ట్రాక్టరును కొంతసేపు నడిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

అల్మాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతు సాధికారసంస్థ ఆధ్వర్యంలో స్థానిక సంహిత ఫంక్షన్ హాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి రైతుభరోసా కేంద్రాల ద్వారా వీఏఏ, వీహెచ్ఏలు సహకారం అందిస్తారన్నారు. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలకు పెట్టుబడులు మండల సమాఖ్య, గ్రామ సంఘాలు, గ్రామ స్వయంసహాయక సంఘాల ద్వారా అందిస్తామన్నారు. ఏపీ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) డీపీఎం బి.తాతారావు, బి.హేమంత్, అడిషనల్ డీపీఎం ఎస్.వల్లి మాట్లాడుతూ నవధాన్యాలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.



ప్రకృతి వ్యవసాయం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

బుర్రిలంకలో చోరీ

కడియం: మండలంలోని బుర్రిలంక గ్రామంలో ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో తాళం బద్దలు కొట్టి బెడ్‌రూమ్‌లోని బీరువాలో ఉన్న సుమారు రూ. 37,500 విలువైన బంగారు వస్తువులను దొంగలు చోరీ చేశారు. ఈ మేరకు బాధితురాలు పి.దీప్తి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటీవల ఆమె కడియపుసావరంలోని పుట్టింటికి వెళ్లింది. ఆమె భర్త మొక్కల వ్యాపారం కోసం చెన్నై వెళ్లాడు. ఈనెల 17వ తేదీన దీప్తి ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా చోరీ విషయం వెలుగు చూసింది. ఎస్ఐ సీహెచ్ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో మహిళ అరెస్ట్

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన కొరడా వెంకటలక్ష్మి సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటలక్ష్మి సోమవారం రాత్రి సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామని, ఆమె నుంచి పది లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.

కంటి వైద్య శిబిరం

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామపంచాయతీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి పోతుల ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య పరీక్షలు చేశారు. 98 మందికి పరీక్షలు చేయగా వారిలో 20 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు.

తాటిముంజెలతో ఉపశమనం

- రోడ్ల పక్కన విక్రయం
- పలువురికి జీవనోపాధి

రాజానగరం: తాటిచెట్టు నుంచి లభించే తాటి కాయలకు వేసవిలో మంచి డిమాండ్ ఉంటుంది. ఆ కాయలను కట్ చేస్తే తాటి ముంజెలు లభిస్తాయి. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరం ఈ తాటి ముంజెలు. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధిని పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతుబిడ్డలకు మాత్రమే దొరికే ఈ తాటిముంజెలు ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో నిమిత్తం లేకుండా బాటసారులకు దారిపొడవునా లభిస్తున్నాయి. వేసవి సెలవులకు వచ్చిన స్నేహితులతులు, బంధువులతో కలిసి సరదాగా పొలాలకు వెళ్లిన భూస్వాముల పిల్లలు తమ పాలికాపుల ద్వారా తాటిచెట్ల నుంచి ముంజెలు కోయించి ఆరగించేవారు. ఈ ఆధునిక కాలంలో ఆ విధంగా పొలాలకు వెళ్లి, తీరుబడిగా ముంజెలు ఆరగించేందుకు తీరిక ఎవరికీ ఉండటం లేదు. భూస్వాముల పిల్లలైనా, వారి స్నేహితులైనా పొలాల్లో అడుగు పెట్టే రోజులు పోయాయి.

అక్షరాభ్యాసంతోనే పోటీతత్వాన్ని అలవర్చుకుంటున్న ఈ రోజుల్లో సామాన్యుల పిల్లలు సైతం పుస్తకాలకు అతుక్కుపోతుంటే ఇక భూస్వాముల పిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. పట్టణాల్లో హాస్టళ్లలో చేర్చి మరీ చదివిస్తుంటే ఇక పొలాల గురించి, తాటి ముంజెల రుచి గురించి తెలుసుకుని ఆస్వాదించే తీరిక వారికి ఎక్కడుంటుంది. అందుకే రోడ్ల పక్కన లభిస్తున్న ఈ తాటిముంజెలపై అందరూ ఆసక్తిని కనబరుస్తున్నారు.



తాటికాయల నుంచి ముంజెలు తీస్తున్న దృశ్యం

సీజన్‌లో ఇదే వృత్తి

రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వరకూ, వెంకన్నపేట నుంచి కాకినాడ వరకు, కొవ్వూరు నుంచి ఏలూరు జంక్షన్ వరకూ రోడ్ల పక్కన ఈ తాటిముంజెలను విక్రయిస్తుంటారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన అనేక మంది ఈ సీజన్‌లో ఇదే వృత్తిగా చేసుకుని జీవనం గడుపుతుంటారు. డజను ముంజెలను కవర్‌లో వేసి రూ.50 లకు విక్రయిస్తున్నారు. ఇక పల్లెల్లో అయితే సైకిళ్లపై ఇంటింటికీ తిరిగి మరీ విక్రయిస్తున్నారు.

అనేక పోషకాలు

వేసవి తీవ్రత కారణంగా మన శరీరంలోంచి పోయే అనేక పోషకాలను కొబ్బరి బొండాలతో పాటు తాటిముంజెలు తిరిగి అందిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వంద గ్రాముల తాటి ముంజెలో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాముల కార్బోహైడ్రేటులు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 61 మి.గ్రా. ఆమ్లం, 12 మి.గ్రా. కాల్షియం, 21 మి.గ్రా. పాస్ఫరస్, 0.3 మి.గ్రా. ఇనుప ధాతువు ఉంటాయి. వీటిని తీసుకోవడం వలన వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన కేలరీలు లభిస్తాయి. అంతే కాక వీటిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తుంటారు. ఈ విధంగా చేస్తే ముఖంలో అలసట పోతుందని, మొటిమలు, నల్లమచ్చలు కూడా తగ్గుతాయని చెబుతారు. జిల్లాలోని మెట్ట ప్రాంతమైన రాజానగరం, రంగంపేట, కొవ్వూరు, గుండుగొలను, కాకినాడ జిల్లాలోని గండేపల్లి మండలాల నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం, జొన్నాడ, సామర్లకోట ప్రాంతాలకు వీటిని తీసుకుపోయి, రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తుంటారు.



తాటి ముంజెలు

చాకిరీ ఎక్కువ

తాటిచెట్లు ఎక్కి తాటి కాయలను కోయడం ఒక ఎత్తు. వాటిని తీసుకువెళ్లి రోడ్ల పక్కన పెట్టి అమ్మడం మరోఎత్తు. తాటి కాయలను పదునైన కత్తితో నైస్‌గా చెక్కి మంజులు జాగ్రత్తగా బయటకు తీయాలి. ఆ విధంగా తీసిన వాటిని 12 (డజను) చొప్పున కవర్లలో వేసి విక్రయిస్తున్నాం. ఈ క్రమంలో చాకిరీ ఎక్కువగానే ఉంటుంది. రాబడి మాత్రం అంతంత మాత్రమే. రోజుకు రూ. 500 పైబడి ఆదాయం వస్తుంది.

– ఊతాడ ఏసు, కోలమూరు

ఆలయానికి షామియానా అందజేత

బిక్కవోలు: మండలంలోని శ్రీ కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే అన్నదాన సమయంలో వినియోగించేందుకు భక్తులు షామియానాను అందజేసినట్టు ఈవో రామలింగభాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కుసుమంచి శ్రీరామమూర్తి, గుణం రమేష్ షామియానా, కుర్చీలు, బల్లలు అందించారని, వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. ప్రతి నెలా మాస శివరాత్రి రోజున గోలింగేశ్వరస్వామికి నిర్వహించే లక్షపత్రి పూజ మంగళవారం గ్రామస్తుల సహకారంతో జరిపించినట్లు ఆయన తెలిపారు.

1156 రకం ధాన్యం కొనుగోలు చేయాలి

గోకవరం: ప్రభుత్వం 1156 రకం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గోకవరం మండల రైతులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 1156 రకం ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమ వద్ద ఉన్న ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చింతల రామకృష్ణ, జుట్టా వీరబాబు, రాయవరపు అప్పారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.